క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ శనివారం పెనమలూరు సెక్షన్ పరిధిల విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా పెనమలూరులో ప్రధాన రహదారి ప్రాంతం, తహసీల్దార్ కార్యాలయం, అన్నే బాబురావు కాలనీ, జగనన్న కాలనీ, పెద్దగుడి సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

వర్గీకరణపై సానుకూల నిర్ణయం తీసుకోవాలి

గన్నవరం: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఇంటలెక్చువల్ ఫోరమ్ ఫర్ మాదిగాస్ రాష్ట్ర అధ్యక్షుడు మట్టా విద్యార్థి శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ గౌబా నేతృత్వంలోని కమిటీ మాదిగలు, మాదిగ ఉపకులాల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. తద్వారా రానున్న పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని కేంద్రానికి విన్నవించారు. దీనివల్ల మాదిగలు, మాదిగ ఉపకులాలు ఉన్నతికి తోడ్పాడాలని కోరారు.

బైక్ చోరీ

పెనమలూరు: తాడిగడప గ్రామంలో ఇంటి బయట పార్కు చేసిన బైక్ చోరీ జరగటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిగడప చెరువు సమీపంలో తలశిల మాధవరావు కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతను ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిస్తాడు. అయితే అతను గత నెల 10వ తేదీన పనులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వచ్చి బైక్ బయట పార్కు చేశాడు. మరలా అతను ఉదయం లేచి చూడగా బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బైక్ కోసం అనేక ప్రాంతాలు వెతికినా దొరకక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చురుగ్గా ఆర్‌యూబీ పనులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఆర్‌యూబీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆర్‌యూబీ పనులలో భాగంగా రిటైనింగ్ వాల్ కాంక్రీట్ పనులు చేస్తున్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నగర పాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు పనులు వేగవంతం చేశారు. సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తి చేసి ఆర్‌యూబీని వినియోగంలోకి తీసుకువస్తామని అధికారులు చెబుతున్నారు.

వనవలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలోని నిజాంపేటలో వేంచేసియున్న విజయ వనవలమ్మ 107వ జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు డెప్యూటీ మేయర్ శీలం భారతి, బాబ్జీ దంపతులు, విన్నకోట వనప్రభాకర్, శైలజ దంపతులు, మిరియాల రామకృష్ణ, అమ్మాజీ దంపతులు, పొన్నూరు శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి దంపతులు, నరహరిశెట్టి కనకదుర్గ ప్రసాద్, విజయలక్ష్మి దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుహాసినీలతో లలితా పారాయణం చేశారు. అమ్మవారి చీరల ప్రసాదాన్ని దంపతులకు అందజేశారు. కమిటీ సభ్యులు వనప్రభాకర్ మాట్లాడుతూ కొండరాతి స్తంభాలతో దేవాలయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ఏటా సంక్రాంతి తర్వాత ఆదివారం జాతర మహోత్సవాలు నిర్వహిస్తామని భక్తులు మొక్కుబడులు చెల్లించుకోవాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిన జనం

గన్నవరం: విజయవాడలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, స్మృతి వనం ప్రారంభోత్సవానికి నియోజకవర్గం నుంచి జనం భారీగా తరలివెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలిమెట్ల జయరాజు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జలసూత్రం రామ్మోహన్‌రావు, పార్టీ నాయకులు మేచినేని బాబు, పడమట సురేష్, యర్రంశెట్టి రామాంజనేయులు, గుడిసె బాలస్వామి, తిరివీధి రంగారావు, పామర్తి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: విజయవాడలో సామాజిక సమత సంకల్ప సభకు ఉయ్యూరు నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అంబేడ్కర్ వాదులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు శుక్రవారం ర్యాలీగా విజయవాడకు తరలివెళ్లారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ ఆధ్వర్యంలో బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాల్లో ప్రజలు జై జగన్, జై భీమ్, జోహార్ అంబేడ్కర్, అంటూ సంకల్ప సభకు బయలుదేరి వెళ్లారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్ బాబు, అర్షతున్నీసాబేగం, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, ఆయా వార్డు కౌన్సిలర్లు, పార్టీ మండల అధ్యక్షుడు దాసే రవి, దళిత ఐక్యవేదిక ప్రతినిధులు పినమాల నాగకుమార్, గెత్తం విజయ్‌కుమార్, పానుగుమాటి బాలస్వామి, బందెల శ్రీనివాసరావు, గరికపూడి బుజ్జి, ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు పాల్గొన్నారు.

కంకిపాడు: సామాజిక సమతా సంకల్ప సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివెళ్లారు. విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి మండలం వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు, అంబేడ్కర్ వాదులు బస్సులు, వాహనాల్లో తరలివెళ్లారు.

పెనమలూరు: విజయవాడలో శుక్రవారం జరిగిన సామాజిక సమతా సంకల్ప సభకు ప్రజలు తరలి వెళ్లారు. మంత్రి జోగిరమేష్ సారథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణను తిలకించటానికి ప్రజలు, అభిమానులు ఉత్సాహం చూపారు. మండల పరిధిలో అన్ని గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. బస్సులను ఎంపీడీఓ సునీతాశర్మ, ఏవో లోయ శివశంకర్ ప్రారంభించారు.

విజయవాడరూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు గ్రామాల నుంచి ప్రజానీకం శుక్రవారం తరలి వెళ్లారు. పలు వాహనాల్లో ఆనందోత్సాహాలతో మహిళలు వెళ్లడం కనిపించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుతో జనం ఉత్సాహంగా గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. 206 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని కనులారా చూసేందుకు వాహనాల్లో బయలుదేరి ఉత్సాహంగా వెళ్లారు. పి.నైనవరం, అంబాపురం తదితర గ్రామాల నుంచి మహిళలు అధికసంఖ్యలో తరలివెళ్లారు.

ఉంగుటూరు మండలం నుంచి..

ఉంగుటూరు: విజయవాడలో భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహం ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని వీక్షించేందుకు మండలంలో ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. మండలం నుంచి భారీ సంఖ్యలో స్వచ్ఛందంగా తరలి వెళ్లారని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. పలువురు ద్విచక్ర వాహనాలపై అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వెళ్లారు. ఈవోపీఆర్‌డీ అమీర్ బాషా తదితరులు ఉన్నారు.



గన్నవరం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద బస్సులను ప్రారంభిస్తున్న పార్టీ నేతలు



పి.నైనవరం, అంబాపురం గ్రామాల నుంచి వెళుతున్న మహిళలు



ఉయ్యూరు నుంచి..



పెనమలూరులో బస్సును ప్రారంభిస్తున్న ఎంపీడీఓ సునీతాశర్మ

కుల గణనకు ప్రత్యేక బృందాల ఏర్పాటు

కంకిపాడు: ప్రభుత్వ ఆదేశాలతో కులగణన నిర్వహణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సమగ్ర కుల ఆధారిత డేటా సర్వే చేపట్టామన్నారు. ఆయా గ్రామాల్లో చేపట్టే సర్వేను పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పునాదిపాడు, గొల్లగూడెం, కోలవెన్ను గ్రామాలకు ఈవోఆర్డీ పీవీఎస్ మైథిలి, కంకిపాడు, గొడవర్రు, కాసరనేనివారిపాలెం గ్రామాలకు డెప్యూటీ తహసీల్దార్ టీ నాగరాజు, నెప్పల్లి, కుందేరు, కందలంపాడు గ్రామాలకు ఎంఆర్ఐ జీ రాఘవరావు, ఉప్పలూరు, దావులూరు, చలివేంద్రపాలెం గ్రామాలకు హౌసింగ్ ఏఈ సీహెచ్.ఎస్.ఎస్.ఆర్.వీ.ప్రసాద్, ప్రొద్దుటూరు, దావులూరు, చలివేంద్రపాలెం గ్రామాలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి, ఈడుపుగల్లు, మంతెన, జగన్నాథపురం గ్రామాలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.సత్యశ్రీ, తెన్నేరు, మారేడుమాక గ్రామాలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ కె.నాగరాజు పర్యవేక్షణాధికారులుగా నియమితులయ్యారన్నారు. నిర్దేశించిన కాలంలో సర్వే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

యోగి వేమన జయంతి



యోగి వేమనకు నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృపానందం, గ్రామస్తులు

గన్నవరం రూరల్: మహాకవి యోగి వేమన పద్యాలు భావితరాలకు సైతం పాఠాలని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం చెప్పారు. శుక్రవారం వేమన జయంతిని పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయం ఆవరణలో ఆయన చిత్రపటానికి పాఠకులు, గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమన శతకాలు విద్యార్థులు నిరంతరం చదవాలని చెప్పారు. వీఆర్వో కొండబాబు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన పేరంటాలమ్మ ఉత్సవాలు



రైవస్ కాలువలో తెప్పోత్సవం



ఊయలసేవకై తీసుకొస్తున్న అమ్మవారి ఉత్సవ విగ్రహాలు

రామవరప్పాడు: రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో వారం రోజులుగా జరుగుతున్న సంక్రాంతి ఉత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. గత 6 రోజులుగా రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రసాదంపాడులో రథోత్సవం ముగింపు అనంతరం ఆలయం ఎదుట అమ్మవారి విగ్రహాలు చేరుకున్నాయి. గ్రామంలోని నూతన వంతెన సమీపంలోని రైవస్ కాలువలో హంస ఆకారంలో ప్రత్యేకంగా అలంకరించిన పడవలో అమ్మవార్లను ఉంచి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం సమీపంలోని రావిచెట్టు ఎదుట ఇరు గ్రామ పెద్దలు, భక్తులు కలిసి రకరకాల పుష్పాలతో అలంకరించిన ఊయలలో అమ్మవార్లను ఉంచి పూలంకి సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ముగ్గురమ్మలను ఆలయంలోనికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఈవో పాతూరి లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్‌లు మాట్లాడుతూ ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామ పెద్దలకు, పోలీసులు, ఆరోగ్య, గ్రామ పంచాయతీ సిబ్బందికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శనివారం ఆలయంలో భారీ అన్నసంతర్పణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామోత్సవ వాహనంలో ఏర్పాటు చేసిన అమ్మవార్ల రథోత్సవ హుండీలు, భక్తులు సమర్పించిన డబ్బుల దండల కానుకల ద్వారా రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో కలిపి అమ్మవార్లకు రూ.11,38,708 ఆదాయం వచ్చినట్లు ఈవో లోకేశ్వరి చెప్పారు.

అలరించిన రామభక్తి సామ్రాజ్య కృతిగానం



సంప్రదాయ కీర్తనలను వీణపై పలికిస్తున్న చిన్నారులు

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యాన అయోధ్య రామ మందిరం స్థాపన సందర్భంగా సత్యనారాయణపురంలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రామభక్తి సామ్రాజ్య కృతి గానం శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. వాగ్గేయకారులు రామదాసు, త్యాగరాజస్వామి, అన్నమయ్య, స్వాతి తిరునాళ్ రచించిన శ్రీ రామచంద్ర ప్రభువు కీర్తనలను మధురంగా గానం చేశారు. శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి కళాశాల బాలబాలికలు వీణపైన, సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, వేమూరి విశ్వనాథ్, విష్ణుమూర్తి సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. కార్తికేయ ఆదినారాయణ, జగన్మోహిని వాద్య సహకారం అందించారు. కార్యక్రమాలను సంస్థ ప్రధాన కార్యదర్శి చిట్టా విశ్వేశ్వర రావు, రామలక్ష్మి నిర్వహించారు.

కులగణనను విజయవంతం చేయాలి



కుల గణన సర్వేలో తన వివరాలను అందిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడ తూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనలో విజయవాడ నగర పాలక సంస్థ ప్రథమ పౌరురాలు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం నగరంలో తొలిసారిగా 46వ డివిజన్ సచివాలయం పరిధిలో ఆమె తన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ నుంచి 28 వరకు నిర్వహించే కార్యక్రమంలో సచివాలయాల సిబ్బంది నగర పౌరుల వద్దకు వచ్చి వివరాలు సేకరిస్తారని తెలిపారు. అందరూ పాల్గొని ఈ సర్వేని విజయవంతం చేయాలని కోరారు.

రేపు విశ్వనాథ భాగవతార్ జయంతి

విజయవాడ కల్చరల్: హరికథ రాజహంస, కళాప్రపూర్ణ డాక్టర్ అమ్ముల విశ్వనాథ భాగవతార్ జయంతి సభను ఆదివారం సాయంత్రం దుర్గాపురంలోని సంగీత కళాశాలలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అమ్ముల ప్రసాద్, బీవీ దుర్గాభవానీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి తరం వారికి హరికథ విశిష్టతను తెలియజేయడానికి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అలాగే హరికథా భాగవతారిణి వెగలిచర్ల నాగమణికి విశ్వనాథ స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. సభలో నగరానికి చెందిన పలువురు సాహితీవేత్తలు, సంగీత విద్వాంసులు పాల్గొంటారని వివరించారు.

మండలంలో తుదిదశకు ఆటల పోటీలు



గంగూరులో క్రికెట్ క్రీడాకారులతో ఏవో లోయ శివశంకర్‌రావు

పెనమలూరు: ఆడదాం ఆంధ్రా ఆటల పోటీలు మండల స్థాయిలో రసవత్తరంగా జరిగి తుది దశకు చేరుకున్నాయి. మండల పరిధిలో శుక్రవారం క్రికెట్ పోటీలు గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించారు. గోసాల-1 సచివాలయం పెనమలూరు-2 సచివాలయాలు ఫైనల్ మ్యాచ్ ఆడాల్సి ఉంది. వాలీబాల్, ఖోఖో, షటిల్, కబడ్డీ ఆటల పోటీలు ఇప్పటికే ముగిశాయి. ఫైనల్ క్రికెట్ శనివారం జరుగుతుందని ఏవో లోయ శివశంకర్‌రావు. ఈ కార్యక్రమంలో గంగూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు అక్బర్ పాషా, వైఎస్సార్ సీపీ సీపీ నేతలు పాల్గొన్నారు.

తాడిగడపలో..

తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు కానూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో తుది దశకు వచ్చాయి. కానూరులో శుక్రవారం యనమలకుదురు-1, పోరంకి-2కు మధ్య జరిగిన క్రికెట్ పోటీ టైగా ముగిసింది. చీకటి పడటంతో సూపర్ ఓవర్ లేదా రీ మ్యాచ్ శనివారం నిర్వహించనున్నారు. మిగితా ఆటల పోటీలు ముగిశాయి.

బస్టాండ్ నుంచి పీడబ్ల్యూడీ గ్రౌండ్ వరకు ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఏపీఎస్‌ఆర్‌టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవం సందర్భంగా ఏపీ స్టేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి పీడబ్ల్యూడీ గ్రౌండ్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రవి, కె.ఎజ్రా శాస్త్రి మాట్లాడుతూ రాష్ట్రానికే వన్నె తెచ్చే విధంగా నగరం నడిబొడ్డులో భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, స్మృతివనం ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి అసోసియేషన్ ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి విగ్రహావిష్కరణ మహోత్సవంలో పాల్గొని వీక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.యాకోబు, అడిషనల్ జనరల్ సెక్రటరీ ఎ.థామస్, సెక్రటరీ వి.జయరావు, ప్రతినిధులు ఎంఎస్‌రావు, ఎల ఇమ్మానుయేల్, బి.బి.నాయక్, కె.వి.స్వామి, వై.ప్రసాద్, ఎం.జాన్స్, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నామంటూ.. పూర్వ విద్యార్థుల భరోసా

స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక చేయూత



బొర్రపోతు పాలెంలోని నాగమల్లీశ్వరికి సాయం చేస్తున్న 1993-94 బ్యాచ్ పూర్వవిద్యార్థులు

పెడన: మేమున్నామంటూ చిన్ననాటి స్నేహితుల కుటుంబాలకు పూర్వ విద్యార్థులు భరోసా ఇచ్చారు. వివరాల్లోకి వెళ్తే పట్టణంలోని భట్ల జ్ఞాన కోటయ్య జెడ్పీహెచ్‌ఎస్‌లో 1993-94 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు. వీరిలో ఇద్దరు మరణించడంతో ఆ రెండు కుటుంబాలకు పూర్వ విద్యార్థులు రూ.15వేలు చొప్పున శనివారం ఆర్థిక చేయూతనిచ్చారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఇర్ఫాన్ పాషా మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ 14న 30 సంవత్సరాల తరువాత అదే పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగిందన్నారు. విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఈ బ్యాచ్‌లోని కొందరు మిత్రులు దురదృష్టవశాత్తు చనిపోవడంతో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా భరోసా ఇస్తూ అండగా నిలిచినట్లు పేర్కొన్నారు. తమతో పాటు చదువుకున్న పూర్వ విద్యార్థిని బందరు మండలం బొర్రపోతు పాలెంకు చెందిన నాగమల్లీశ్వరి భర్త మాగంటి రామకృష్ణ చనిపోవడంతో ఆమెకు రూ.15వేలు, గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామానికి చెందిన నున్న ఉమానాగేంద్రం మృతి చెందడంతో అతని భార్య సుజాతకు రూ.15వేలు ఆర్థిక సాయం అందించామన్నారు. కార్యక్రమంలో మధుసూదన రావు, మెట్ల గోపి, చాంద్ బాషా, విశ్వమ్, ఇస్మాయిల్, ప్రసాద్, లావణ్య, బాసిద్, బి.కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఇటీవల హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందాడు. స్థానిక ఇందిరానగర్‌కు చెందిన కుంచనపల్లి వెంకట సత్యనారాయణ (70) ఈ నెల 3వ తేదీన సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళ్లుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో కాలు నుజ్జునుజ్జు కావటంతో విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్ఐ ఏడీఎల్ జనార్ధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కమ్మేసిన పొగమంచు



మంచు చిరుజల్లులుగా కురిసి దట్టంగా కమ్మేసింది. ఇళ్లు, వీధులు, పంట పొలాలపై పొగమంచు దుప్పటిలా పరుచుకుంది. మంచు వర్షంలా కురవటంతో ప్రకృతి ఆరాధకులు ఆనందం పొందారు. శుక్రవారం ఉదయం 8 గంటల వరకూ మండలంలో పొగ మంచు వీడలేదు. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. -కంకిపాడు